
www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 8 ఫిబ్రవరి 2025



'మిట్స్'లో అశ్వ్-2025



ఫ్లాష్ మాబ్స్‌ను చేస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి-మదనపల్లి : మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులు ఫ్లాష్ మాబ్స్‌ను ఏర్పాటు చేసి వివిధ రకాల పాటలకు నృత్యాలు చేసి అలరించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ యువరాజ్ తెలిపారు. ఈ నెల 21, 22వ తేదీలలో రెండు రోజుల పాటు కళాశాల లో వివిధ పోటీలను నిర్వహిస్తామని అన్నారు. జాతీయ స్థాయిలో ఇంజినీరింగ్, డిగ్రీ, పీజీ చదువుతున్న విద్యార్థులు పాల్గొనవచ్చని చెప్పారు. వివరాలు కళాశాల అశ్వ్ వెబ్ సైట్ www.ashv2k.in లేదా www.mits.ac.inలో పొందుపరిచామన్నారు. ఈ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ వివరాలు, పోటీలకు సంబంధించిన వివరాలు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఏటా సినీ ప్రముఖులు పాల్గొని విద్యార్థులను అలరిస్తారని చెప్పారు. 21న నేపథ్య గాయకులు సమీరా భరద్వాజ్, దీపు హారిక నారాయణ్, 22న హీరోయిన్ నేహాశెట్టి పాల్గొంటారని తెలిపారు. చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌ఆర్‌ఆర్ ఎడ్యుకేషన్ అకాడమీ ద్వారకానాథ్, కళాశాల అశ్వ్-2025 కన్వీనర్, వైస్ ప్రిన్సిపల్ కమాల్‌బాషా, కో-కన్వీనర్ ప్రదీప్ కుమార్ స్టూడెంట్ కో-ఆర్డినేటర్స్ జగన్‌మోహన్‌రెడ్డి, సుశాంత్, పవన్, వంశీధర్‌రెడ్డి, హారిక, హర్షిత పాల్గొన్నారు.

సమగ్రంగా చర్చించేనా?

- రబీపై లోతైన చర్చ అవసరం
- కదలని ఉక్కు పరిశ్రమ పనులు
- షాదీఖానా అద్దెల గోల్‌మాల్‌పై ఏదీ స్పష్టత
- నేడు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం



కడప జిల్లా పరిషత్ సమావేశ భవనం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఉమ్మడి జిల్లా ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై పాలకుల్లో చిత్తశుద్ధి కొర వడింది. శనివారం జడ్‌పి చైర్మన్ అధ్యక్షతన జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహణకు సర్వం సిద్ధమైంది. జిల్లాలో 72 నుంచి అనుబంధ విభాగాలను కలుపుకుని 102 శాఖలు ఉండగా, కేవలం 11 నుంచి 15 శాఖ లకు చర్చను పరిమితం చేయనుండడం విస్మయాన్ని కలిగిస్తోంది. జిల్లా వ్యవసాయాధారిత ప్రాంతం. జీవనాధారమైన రంగంపై సమగ్రంగా చర్చించాల్సి ఉంది. ముఖ్యంగా రబీ సీజన్‌లో రైతాంగం ఎదుర్కొంటున్న నకిలీ విత్తన నివారణ, బుడ్డశనగ ధరల తగ్గుదల, అన్నదాతా సుఖీభవ నిధుల జమ, క్రాప్ ఇన్సూరెన్స్ వంటి సమస్యలపై దృష్టి సారించాల్సి ఉంది. వ్యవసాయ, పారిశ్రామిక. సాగునీటి పారుదల, విద్య, వైద్య రంగాలు ఎదుర్కొంటున్న ప్రతికూలతలు జిల్లా ప్రగతిని ప్రశ్నార్థకంగా మారుస్తున్నాయి. జిజిహెచ్ సూపర్ స్పెషాలిటీ, కేన్సర్ విభాగాలకు వైద్య నిపుణులు, నర్సింగ్ సిబ్బంది, టెక్నీషియన్స్ కొరతపై దృష్టి సారించాలి. ఉక్కు పరిశ్రమ, ఆర్కిటెక్షర్ యూనివర్శిటీ నిర్మాణ పనులపై చర్చించాల్సి ఉంది. కొప్పర్తి పైప్‌లైన్ పనుల పురోగతిని ఆరా తీయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

జిల్లాలో వరి రైతు నకిలీ విత్తన సమస్యతో సతమతమవుతున్నారు. రవి తర్వాత ప్రధాన ఆహార పంట బుడ్డశనగ. జిల్లాలో సుమారు 1.80 లక్షల ఎకరాల్లో సాగు చేయడం తెలిసిందే. ఇటువంటి ప్రధాన పంట దిగు బడుల తోపాటు మార్కెట్లో ధరల తగ్గుదల ఆందోళన కలిగిస్తోంది. ప్రభుత్వమే కొనుగోలు చేయడంపై సమగ్రంగా చర్చించాల్సిన అవసరం ఉరుముతోంది. అన్నదాతా సుఖీభవ, సబ్సిడీ డ్రోన్ల పంపిణీ వ్యవహారం తేల్చాలి. విద్యకు సంబంధించిన ఫీజురీయింబర్స్‌మెంట్, తల్లికి వందనం పథకాల నిధుల జమ చేయడంపై నిలదీయాల్సిన అవసరం ఉంది. వైద్యరంగానికి వస్తే జిజిహెచ్ సూపర్ స్పెషాలిటీ, కేన్సర్ విభాగాలకు వైద్య నిపుణులు, నర్సింగ్ సిబ్బంది, ఆధునిక పరికరాల ఆపరేటర్ల నియామకం వంటి అంశాలపై స్పష్టత ఇవ్వాల్సి ఉంది. అన్నమయ్య రిజర్వాయర్ పునరుద్ధరణ, శ్రీనివాసపురం రిజర్వాయర్ల పనులను పూర్తి చేయాల్సి ఉంది. జిఎన్ఎస్ఎస్ ఫేజ్-2, హెచ్ఎన్ఎస్ కాలువల పనులకు మోక్షమెప్పుడో తేలాల్సి ఉంది. కడప కార్పొరేషన్‌లో దేవునికడప రహదారి విస్తరణ పెండింగ్, నాలుగు స్ట్రోమ్ డ్రెయిన్ పనులపై చర్చించాల్సిన అవసరం ఉంది. గండికోట, సోమశిల నిర్వాసితుల మొరను ఆలకించాలి. సర్వారాయసాగర్, బ్రహ్మసాగర్, చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పరిధిలోని లింగాల కాల్వ లీకేజీ, యురేనియం పైప్‌లైన్ పనుల నత్తనడకను సమీక్షించాలి. 2021 నవంబర్ వరదల్లో అన్నమయ్య రిజర్వాయర్ మట్టికట్ట తెగిన సందర్భంగా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నిర్వాసితులకు ఇచ్చిన హామీలో పురోగతి కొరవడింది. యర్రబల్లి-పార్నపల్లి పైప్‌లైన్ పనుల ఆలస్యం కారణంగా యురేనియం నిర్వాసిత గ్రామాలకు తాగునీటి సమస్య ఎప్పటికి పరిష్కారమవు తుందో తెలియలేదు. గండికోట నిర్వాసితులకు రూ.ఏడు లక్షల పరిహారానికి అదనంగా మరో రూ.మూడు లక్షలను అందిస్తామని ఇచ్చిన హామీ అమలు కావడం లేదు.

ఉక్కు పరిశ్రమ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారాయి. సార్వత్రిక ఎన్నికల అనంతరం రాష్ట్రంలో కూటమి సర్కారు అధికారంలోకి రావడంతో ఉక్కు పనుల పురోగతిపై సందేహం నెలకొంది. 2019 సార్వత్రిక ఎన్నికల ముంగిట తాము అధికారంలోకి వచ్చిన మూడేళ్లలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ వైఫల్యం జిల్లాకు శాపంగా మారింది. 2024 ప్రథమార్థంలో జెఎస్‌డబ్ల్యూ చేపట్టిన ఉక్కు పరిశ్రమ పనుల్లో ఎటువంటి కదలిక కనిపించడం లేదు. రూ.150 కోట్ల కొప్పర్తి పైప్‌లైన్ ఏర్పాటు ప్రక్రియ ఎప్పటికి పూర్తవు తుందో తెలియడంలేదు. ఐసిడిఎస్ పరిధిలోని పలు అంగన్వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో మగ్గుతున్నాయి. ఐసిడిఎస్ జిల్లా అధికారులు అంగన్వాడీ భవన నిర్మాణాలను చేపట్టడంలో మీనమేషాలు లెక్కిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. జడ్‌పి నిధుల నుంచి చేపడతామన్నా ముందుకురాని పరి స్థితి నెలకొంది. జిల్లాలోని సుమారు 17 నుంచి 18 షాదీ ఖానాల అద్దె వసూళ్ల గోల్‌మాల్‌పై పెదవి విప్పని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా జిల్లా పరిషత్ పాలకవర్గం జిల్లా సమగ్రాభివృద్ధిపై సమగ్రమైన చర్చ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పడంలో సందేహం లేదు.

ఉద్యోగుల జీతాలు వెనక్కి తీసుకోవడం సరికాదు

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు



మాట్లాడుతున్న రామాంజులు

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల విజన్ 2047తో సంపద సృష్టించి రాష్ట్రాభివృద్ధిని పరుగులెత్తిస్తానని చెప్పడం వెనుక డిగ్రీ కాలేజ్ కాంట్రాక్టు ఉద్యోగుల జీతం వెనక్కి తీసుకుని సంపద సృష్టి అనడం దారుణమని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ డీగ్రీ కళాశాలలో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు 2019లో పది రోజుల మినహాయించి ఏప్రిల్, మే నెలలు తో అన్ని నెలలకు వేతనాలు చెల్లించి ఇదే పద్ధతి అమలు చేసే విధంగా 2020,2021 ప్రొసీడింగ్స్ అమలు చేసిందన్నారు. దీనిని కొనసాగించాల్సిన కూటమి ప్రభుత్వం ఆ పని చేయకపోగా 2021 సంవత్సరంలో వాడిన విద్యుత్‌కు విద్యుత్ ట్రూ ఆఫ్ చార్జీలు, సర్ చార్జీలు పేరుతో రూ.20 వేల కోట్ల బారాన్ని వేసినట్లు, 2019లో ఏప్రిల్ మే నెలల పని చేసిన కూడా ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ కాంట్రాక్టు ఉద్యోగుల జీతాలను వెనక్కి తీసుకోవాలని జిఓ విడుదల చేయడం దారుణమన్నారు. వెంటనే ఆ జిఓను వెనక్కి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఎపిజిబిని కడపలోనే కొనసాగించాలి

- పోస్టర్ ఆవిష్కరణలో అభివృద్ధి వేదిక నాయకులు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డాక్టర్ ఓబుల్‌రెడ్డి, లక్ష్మీరాజ

ప్రజాశక్తి-కడప అర్బన్

ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు (ఎపిజిబి) ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాలని రాయలసీమ అభివృద్ధి వేదిక కన్వీనర్ డాక్టర్ సి.ఓబుల్‌రెడ్డి, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా డిమాండ్ చేశారు. శుక్రవారం ఓ ప్రయివేటు ఆస్పత్రిలో పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని అతి పెద్దదైన ఎపిజిబిలో మిగిలిన గ్రామీణ బ్యాంకులు విలీనం అవుతున్న నేపథ్యంలో ఇక్కడి ప్రధాన కార్యాలయాన్ని ఇక్కడే కొనసాగించాలని అమరావతికి తరలించాలనే ప్రయత్నం విరామించుకోవాలని చెప్పారు. ఇది పాలకవర్గ పార్టీలకు రాయలసీమ పట్ల వున్న వివక్షకు నిదర్శనమని తెలిపారు. రాయలసీమ ప్రజలు రాజకీయాలకు అతీతంగా ఎపిజిబి ప్రధాన కార్యాలయాన్ని విలీనం తర్వాత కూడా కడపలోనే కొనసాగిం చాలని కోరుకుంటున్నారని పేర్కొన్నారు. వ్యాపారంలో, లాభాల్లో, మౌలిక సదుపాయాలు కలిగి ఉండడంలో, సాంకేతికత, కరెన్సీ చెస్ట్ ఇలా అన్నింటా ఎపిజిబి దేశంలోనే అగ్రస్థానంలో ఉందన్నారు. అలాంటి బ్యాంక్ ప్రధాన కార్యాలయాన్ని అమరావతికి తరలించడమంటే వెనకబడిన ప్రాంతాల పట్ల కక్ష పూరిత వైఖరి ప్రదర్శించడమేనన్నారు. ఇప్పటికే లోకాయుక్త, ఎంఎస్‌ఎంఇ ట్రైనింగ్ సెంటర్‌ను, న్యాయ విశ్వవిద్యాలయాన్ని, హైకోర్టును, నార్కోటిక్స్ కోర్టులను రాయలసీమకు లేకుండా చేశారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం, సాంప్రదాయం ప్రకారం కడపలోనే ఎపిజిబి హెడ్ క్వార్టర్‌ను కొనసాగించాలని తెలిపారు. లేనిపక్షంలో రాజకీయాలకతీతంగా అన్ని పక్షాలను, ప్రజాసంఘాలను, మధ్యతరగతి ఉద్యోగులు, ఉపాధ్యాయులను, ప్రజలను, బ్యాంకు అకౌంట్ హోల్డర్స్‌ను సమీక రించి పోరాటం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో అభివృద్ధి వేదిక నాయకులు ఇ.ప్రవీన్, లోహిత్ మనోజ్, రవి పాల్గొన్నారు.



ఎపి గురుకుల పాఠశాలలో విచారణ చేపట్టిన అధికారులు

పేరెంట్స్ కమిటీ ఫిర్యాదుతో గురుకులంలో విచారణ

ప్రజాశక్తి-పీలేరు

పీలేరులోని ఎపి గురుకుల బాలికల పాఠశాలలో పేరెంట్స్ కమిటీ ఫిర్యాదు మేరకు ఎపి గురుకుల పాఠశాలల జిల్లా కన్వీనర్ బ్రహ్మాజీ విచారణ చేపట్టారు. శుక్రవారం ఆయన పీలేరు శ్రీకృష్ణదేవరాయ నూనెవిత్తుల కర్మాగారం ఆవరణంలోని ఎపి గురుకుల బాలికల పాఠశాలను సందర్శించారు. స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు ఇటీవల పాఠశాల యాజమాన్య కమిటీ పాఠశాలలో విద్యార్థినులకు కోడిగుడ్లు సరఫరా చేయడం లేదని ఆరోపిస్తూ ఫిర్యాదు చేసినట్లు తెలిసింది జిల్లా కన్వీనర్ బ్రహ్మాజీ పాఠశాలలో పరిస్థితులపై విచారణ చేపట్టారు. విచారణలో కోడిగుడ్లు సరఫరా చేసే కాంట్రాక్టర్ తన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించకపోవడంవల్లే విద్యార్థినులకు కోడిగుడ్లు అందలేదని తేలింది. దీనిపై కన్వీనర్ తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తూ, కాంట్రాక్టర్‌ను వెంటనే మార్చాలని ఆదేశాలు జారీ చేశారు. అదనంగా పాఠశాలలో విద్యార్థినులకు అందుతున్న భోజన ప్రమాణాలు, హాస్టల్ వసతులు, తరగతి గదుల నిర్వహణ, ఇతర మౌలిక సదుపాయాలను సమగ్రంగా తనిఖీ చేశారు. విద్యార్థినుల ఆరోగ్యం, విద్య, వసతి, భోజనం తదితర విషయాల్లో ఏవైనా లోపాలు ఉంటే వాటిని తక్షణమే సరిచేసుకోవాల్సిందిగా పాఠశాల యాజమాన్యానికి సూచనలు ఇచ్చారు. విచారణ అనంతరం కన్వీనర్ బ్రహ్మాజీ మాట్లాడుతూ పాఠశాల నిర్వహణ, విద్యార్థినులకు అందుతున్న సదుపాయాలు తృప్తికరంగా ఉన్నప్పటికీ, కోడిగుడ్లు సరఫరా చేసే కాంట్రాక్టర్ తన బాధ్యతలను నిర్వర్తించడంలో విఫలమయ్యాడన్నారు. ఈ విషయాన్ని ప్రిన్సిపల్ లోకేశ్వరి ముందుగా ఎందుకు తెలియజేయలేదని ప్రిన్సిపల్‌పై మండిపడ్డారు. కోడిగుడ్లు సరఫరా చేసే కాంట్రాక్టర్‌ను తక్షణమే మార్చాలని ఆదేశించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ లోకేశ్వరి, సిబ్బంది, పేరెంట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ రుణాల గడువు పెంపు

ప్రజాశక్తి-వాల్మీకిపురం : ప్రభుత్వం బిసి, ఒసి, మైనార్టీలకు సంబంధించిన కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు గడువును ఈ నెల 12వ తేది వరకు పెంచినట్లు ఎంపిడిఒ మనోహర రాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్ రుణాలను పొందేందుకు సంబంధిత ధృవీకరణ పత్రాలతో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. మండలంలోని బ్యాంకులకు ఏ బ్యాంకుకు ఎన్ని యూనిట్లు అనే విషయాలను ఎంపిడిఒ కార్యాలయం నోటీసు బోర్డు నందు ప్రచురించినట్లు తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : విద్యార్థులు తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని యూత్ కరాటే క్లబ్ వ్యవస్థాపకులు డాక్టర్ ఎఆర్.సురేష్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కోటబడిలో పదవ తరగతి విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేశారు. ఈ సంద ర్భంగా పాఠశాల హెచ్‌ఎం విజయలక్ష్మి మాట్లాడుతూ పేద విద్యార్థులకు సాయం చేయడంలో సురేష్ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. కోటబడి పూర్వవిద్యార్థులు 40 మంది విద్యార్థులకు రైటింగ్ ప్యాడ్, జామెట్రీ బాక్స్, పెన్సిల్, అరైజర్, పెన్నులు అందించి సేవా గుణాన్ని చాటుకున్నారన్నారు. ప్రతి ఏటా పరీక్ష సామాగ్రి వితరణ చేసి దాతృత్వాన్ని చాటుకుంటూ విద్యార్థులకు అండగా నిలుస్తు న్నారని తెలిపారు. అనంతరం డాక్టర్ సురేష్ మాట్లాడుతూ 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు రాసే ప్రతీ విద్యార్థి మొదటి, రెండవ ర్యాంకుల సాధనే లక్ష్యంగా సన్నద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మునినాయక్, కిరణ్ కుమార్ రెడ్డి, అబ్దుల్ జబ్బర్, శ్రీనప్ప, బాల వరప్రసాద్, మోహన్, చంద్రశేఖర్, ఖాదర్‌బాషా, విద్యార్థులు పాల్గొన్నారు.

మదనపల్లె రూరల్ సిఐగా సత్యనారాయణ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : మదనపల్లె రూరల్ సిఐగా సత్యనారాయణ శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాల నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణకు అధిక ప్రాధాన్యతనిస్తామన్నారు. గతంలో మదనపల్లె తాలూకా సిఐగా పనిచేసిన అనుభవం తనకు దోహదపడుతుందన్నారు. ముఖ్యంగా ప్రజలు అల్లర్లు, గొడవలకు దూరంగా ఉండాలని, యువత చెడువ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. బాధ్యతలు చేపట్టిన సత్యనారాయణకు ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

మదనపల్లె ప్రజల దాహార్తిని తీరుస్తాం : ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె నియోజకవర్గం నుంచి కుప్పం వరకు శాశ్వతంగా తాగునీటి సమస్యను పరిష్కారం చేసేవిధంగా జలజీవన్ మిషన్ ప్రాజెక్టును ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రూ.3,250 కోట్లతో డీటెయిల్ ప్రాజెక్ట్ రిపోర్ట్ తయారుచేసి మంజూరు చేశారని ఎమ్మెల్యే షాజహాన్ బాషా ప్రకటించారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ త్వరలోనే డిపిఆర్ కు టెండర్లు పిలవనున్నారని స్పష్టం చేశారు. తద్వారా నియోజకవర్గంలో అన్ని హ్యాబిటేషన్లలో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని చెప్పారు. నియోజకవర్గంలో 640 హ్యాబిటేషన్లలో ప్రతి హాబిటేషన్ కు ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకు, పైప్ లైన్ ద్వారా పూర్తిస్థాయిలో నీటిని అందిస్తామని తెలిపారు. రామసముద్రం మండలానికి చెందిన ఆర్డబ్ల్యూఎస్ ఎఇ రియాజ్ ప్రావీణ్యంతో ప్రాజెక్ట్ రిపోర్ట్ తయారీలో రాష్ట్ర ఉన్నతాధికారులు అభినందించడం జరిగిందన్నారు. 2060 సంవత్సరం వరకు ఈ ప్రాజెక్టు ద్వారా నీటి సమస్య ఉత్పన్నం కాకుండా అందించవచ్చునన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రత్యేక గ్రీవెన్స్‌ను నిర్వహిస్తున్నామని ప్రజలంతా ఏదైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవచ్చునని తెలిపారు. మదనపల్లిని జిల్లా కేంద్రంగా చేయాలనే పూర్తి బాధ్యతతో తాము పనిచేస్తున్నట్లు వెల్లడించారు. ప్రతిపక్ష పార్టీ ఉర్దూ స్కూల్స్ రద్దు చేస్తున్నారని చేస్తున్న విమర్శలలో వాస్తవం లేదన్నారు. అన్ని స్కూల్స్ యథావిధిగా కొనసాగించడం తోపాటు మోడల్ స్కూల్స్‌గా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. మదనపల్లి పట్టణంలో ఆటోనగర్ సమస్యను పూర్తి స్థాయిలో పరిష్కరించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. పుంగనూరు రోడ్డు వాల్మీకి సర్కిల్ నుంచి డిఎస్పి బంగ్లా వరకు ట్రాఫిక్ ఇబ్బందుల పరిష్కారానికి 100 అడుగుల రోడ్డుగా మార్చనున్నట్లు స్పష్టం చేశారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లామని గుర్తు చేశారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించడానికిగాను రూ.300 కోట్లతో కేంద్రం ఔటర్ రింగ్ రోడ్డు మంజూరు చేసిందన్నారు. గడిచిన ఐదేళ్లలో ప్రతిపక్ష ప్రభుత్వం రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందని ధ్వజమెత్తారు. జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ఆర్థిక విధ్వంసం సృష్టించారని అభివృద్ధికి నిధులు కొరత సమస్యగా మారిందని పేర్కొన్నారు. మదనపల్లెలో శత సంవత్సరాల చరిత్ర కలిగిన ప్రభుత్వ బీటీ కళాశాలను యూనివర్సిటీ స్థాయిలో అభివ ృద్ధి చేస్తామన్నారు. రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని టమోటా ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. గత ప్రభుత్వం మంజూరు చేసిన మెడికల్ కళాశాల భవన నిర్మాణ పనులు నాణ్యత లోపంతో ఉన్నాయని దీనివల్ల విద్యార్థుల భద్రతకు ముప్పు వాటిల్లే ప్రమాదం పొంచి ఉందని చెప్పారు. మదనపల్లి పట్టణంలో తాగునీటి ఎద్దడి లేకుండా చేయడం కోసం చిప్పిలి, గుట్టకిందపల్లి సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుల తూములు నిర్మాణ పనులు పూర్తి చేసి నీటిని అందించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలోనే మదనపల్లికి ముఖ్యమంత్రిని తీసుకువచ్చి నియోజకవర్గాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయడానికి కట్టుబడి ఉన్నట్లు ప్రకటించారు. రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి ఆర్.జె వెంకటేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జలజీవన్ మిషన్ ద్వారా అన్నమయ్య, చిత్తూరు జిల్లాలో తాగునీటి సమస్యను పరిష్కరించడం పట్ల హర్షం ప్రకటించారు. కేంద్రంలో డబుల్ ఇంజన్ సర్కార్‌తో రాష్ట్రంలో అభివృద్ధి దూసుకుపోతుందని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు యర్రబెల్లి వెంకటరమణారెడ్డి, నాగూర్‌వలి, రాటకొండ మధుబాబు, షంషీర్, కమలామర్రి కృష్ణ, మల్లికార్జున నాయుడు, బెల్లె రెడ్డి ప్రసాద్, వేమయ్య, రామకృష్ణ, విద్యాసాగర్ జెసిబి మధు, కలకడ వేణుగోపాల్ పాల్గొన్నారు.

బాలల ఆరోగ్యంతోనే దేశ సౌభాగ్యం

ప్రజాశక్తి-పీలేరు

బాలల ఆరోగ్యంతోనే దేశ సౌభాగ్యం ముడిపడి ఉందని పీలేరు ఎంపిడిఒ శివశంకర్, తలుపుల పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ రమేష్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మండల స్థాయి (టాస్క్ పోర్స్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లల్లో నులిపురుగుల సంక్రమణ ప్రతికూల ప్రభావంతో రక్తహీనత, పోషణ లోపం, బలహీనత, కడుపునొప్పి, వీరేచనాలు మొదలగు అనారోగ్య లక్షణాలతో పిల్లలు ఏకాగ్రత, నేర్చుకో గల సామర్థ్యం కోల్పోవడమే కాకుండా చదువులో రాణించలేరని అన్నారు. నులిపురుగుల సంక్రమణ వ్యాప్తిని నియంత్రించే ఆల్బెండజోల్ 400 మాత్రను ప్రతి విద్యార్థి సద్వినియోగానికి అందరం బాధ్యత వహిద్దామని చెప్పారు.ఎంఇఒ లోకేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ మండల పరిధిలోని 24,880 మంది వివిధ స్థాయి విద్యార్థులు అల్బెండజోల్ 400 మాత్రలు సద్వినియోగం చేసుకునేందుకు కృషి చేస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో డాక్టర్ రమేష్ రెడ్డి, డాక్టర్ కార్తీక్ కుమార్, ఎంఇఒలు వై. లోకేశ్వర్ రెడ్డి, పద్మావతి, పీలేరు ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ రాజమ్మ, వివిధ పాఠశాల ప్రధానోధ్యాయులు, సిహెచ్ఒ జయలక్ష్మి, పర్యవేక్షణాధి కారులు, ఎఎన్ఎంలు, ఆశ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వాల్మీకిపురం : ఆల్‌బెండజోల్ 400 మీ.గ్రాముల మాత్రతో నులిపురుగులను నలిపేద్దామని స్థానిక ఎంపిడిఒ మనోహర రాజు అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో నులిపురుగల నిర్మూలన దినోత్సవం గోడపత్రికలను వైద్య సిబ్బందితో కలసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 10వ తేది మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఉన్న విద్యార్థులకు, సంవత్సరం వయస్సు నుంచి 18 సంవత్సరాలు వయసు లోపు ఉన్న పిల్లలందరికీ ఆల్‌బెండజోల్ మాత్రలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. 10వ తేది పాఠశాలలకు గైర్హాజరు అయిన పిల్లలకు 17వ తేదిన పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అనంతరం హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ మాట్లాడుతూ వాల్మీకిపురం మండల వ్యాప్తంగా 9560 మంది పిల్లలకు ఆల్‌బెండజోల్ మాత్రలను పంపిణీ చేయడమే లక్ష్యంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ వెంకటలక్ష్మీ, టిబి యూనిట్ సూపర్‌వైజర్ నాగిరెడ్డి, ఎంఎల్‌హెచ్‌పి అమృత, సిబ్బంది పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ముస్లిం మైనార్టీల సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు పెద్దపీట వేస్తున్నారని ఎపి మైనార్టీల వ్యవహారాల శాఖ సలహాదారు మహమ్మద్ అహ్మద్ షరీఫ్ పేర్కొన్నారు. రాయలసీమ జిల్లాల పర్యటనలో భాగంగా శుక్రవారం మదనపల్లెకు వచ్చారు. ఎమ్మెల్యే షాజహాన్ బాషా ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా షరీఫ్ మాట్లాడుతూ రాయలసీమ జిల్లాల్లో మైనార్టీల స్థితిగతులను, ఇక్కడ పరిస్థితులను అంచనా వేయడానికి రాష్ట్ర ప్రభుత్వం తనను నియమించిందని, ఇందులో భాగంగానే జిల్లాల పర్యటన చేపట్టినట్లు తెలిపారు. ముస్లిముల సంక్షేమం, అభివృద్ధి కోసం సిఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారని అన్నారు. ముస్లిం మైనార్టీలకు అన్నిరంగాల్లో ప్రాధాన్యతనిస్తున్న ఏకైక పార్టీ టిడిపినేని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎంతో అనుభవం కలిగిన వ్యక్తి, మాజీ శాసనమండలి చైర్మన్ షరీఫ్ అని అన్నారు. గతంలో శాసనమండలి చైర్మన్‌గా ఆయన పనితీరు రాజ్యాంగం గర్వించే విధంగా ఉందన్నారు. ఆయన సమర్థతను గుర్తించిన సిఎం మైనార్టీ వ్యవహారాల సలహాదారు బాధ్యతను షరీఫ్‌కు అప్పగించడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో యువ నాయకులు జునైద్ అక్బరీ, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శి ఎస్.ఎం.ఫర్వీన్ తాజ్, టిడిపి మైనార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ఎ.మస్తాన్ పాల్గొన్నారు.

రచయితల మహాసభలకు 'పసుపులేటి'కి ఆహ్వానం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

కడప జిల్లా రచయితల మహాసభలు రచయితల సంఘం ఆధ్వర్యంలో ఫిబ్రవరి శని, ఆదివారం జరిగే కడప నగరంలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ భవనంలో జరిగే కార్యక్రమానికి రాజంపేట సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్, ఒంటిమిట్ట పోతన సాహిత్య పీఠం అధ్యక్ష, కార్యదర్శులైన డాక్టర్ పసుపులేటి శంకర్, విద్వాన్ ముమ్మడి నారాయణరెడ్డిని ఆహ్వానించారు. 9న ఉదయము 10 గంటలకు రాజగోపాలనాయుడు సభా వేదికలో జరిగే రాయలసీమ సాహిత్యం సదస్సుకు డాక్టర్ పసుపులేటి శంకర్ ను ముఖ్య అతిధిగా ముమ్మడి నారాయణరెడ్డి ని ఆత్మీయ అతిధిగా ఆహ్వానించారు. కార్యక్రమములో ఆంధ్రప్రదేశ్ శాసన సభ ఒఎస్‌డి టు గవర్నమెంట్ విప్ డాక్టర్ ఎం.ప్రభాకర్, సభాధ్యక్షులుగా కవులు కె.వి రమణారెడ్డి, డాక్టర్ వెంకటేశ్వరచారి పాల్గొంటారన్నారు.



పద్మ లలితను సన్మానిస్తున్న ఉపాధ్యాయ బృందం

సమాజంలో మహిళల పాత్ర కీలకం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

సమాజంలో మహిళల పాత్ర కీలకమని అన్నమాచార్య యూనివర్సిటీ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ విభాగాధిపతి డాక్టర్ ఎం.పద్మలలిత పేర్కొన్నారు. శుక్రవారం ఆర్ఎస్ రోడ్డు లోని శ్రీ చైతన్య పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఆకేపాటి సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్మార్ట్ లివింగ్ కార్యక్రమంలో భాగంగా భేటీ సమ్మాన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ ఎం.పద్మలలిత విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ కుటుంబ వ్యవస్థలోనూ, సమాజంలోనూ స్త్రీ పాత్ర కీలకమని తెలిపారు. మహిళల ప్రతిష్టకు భంగం వాటిల్లకూడదని అన్నారు. ప్రిన్సిపల్ ఆకేపాటి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ మహిళలతో నడుచుకునే తీరు, కుటుంబంలోనూ, సమాజంలోనూ వారి పాత్ర గురించి విద్యార్థులకు వివరించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న పద్మలలితను ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపల్ అనూష, అకడమిక్ డీన్ వెంకటసుబ్బయ్య, సి బ్యాచ్ ఇన్‌ఛార్జి శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన తహశీల్దార్ ధనుంజయులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె తహశీల్దార్‌గా కె.ధనుంజయులు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం అధికారులు, విఆర్‌ఒలతో సమావేశమై భూపరిపాలన, ఆదాయశాఖ కార్యక లాపాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ప్రజలకు వేగవంతమైన, పారదర్శక సేవలు అందించడమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తామన్నారు. భూవివాదాల పరిష్కారం, రైతులకు పాసుపుస్తకాలు, 1బిలు సకాలంలో అందించడం, రెవెన్యూశాఖ సేవల మెరుగుదల కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. ప్రజలు తహశీల్దార్ కార్యాలయానికి వచ్చి ఇచ్చిన ఫిర్యాదులను సమర్థవంతంగా పరిష్కరిం చేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను మండల పరిధిలోని అర్హులందరికీ అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. తహశీ ల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన కె.ధనుంజయులుకు ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతి నిధులు శుభాకాంక్షలు తెలిపారు.

రాజముద్రలో ఉర్దూ భాషకు చోటు కల్పించాలి

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజముద్రలో రెండో అధికార భాష ఉర్దూను చోటు కల్పించాలని సహారా వెల్ఫేర్ సొసైటీ ప్రధాన కార్యదర్శి షేక్ అఫ్తాబ్ పేర్కొన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర రాజముద్రలో రెండు అధికార బాషగా ఉన్న ఉర్దూకు చోటు కల్పించిన విషయం అందరికీ తెలిసిందేనని అన్నారు. రాష్ట్ర రాజముద్రలో కూడా ఉర్దూ భాషను చోటు కల్పించాలని పేర్కొన్నారు. స్వాతంత్ర ఉద్యమంలో, ఉర్దూ సాహిత్యం ఎంతోమందిని దేశం కోసం ప్రాణ త్యాగానికి ప్రేరేపించి ఉద్యమంలో ముఖ్య భూమిక పోషించిందని వారు గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అధికార కార్యకలాపాలు, ఉత్తర, ప్రత్యుత్తరాలను తెలుగుతో పాటు ఉర్దూ లోనూ సాగించేలాగ సమాన హోదా కల్పించేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ గురువారం రాయచోటికి వచ్చిన ఎపి రాష్ట్ర మైనార్టీల వ్యవహారం ముఖ్య సలహాదారులు ఎం.ఎ.షరీఫ్‌ను స్టేట్ గెస్ట్ హౌస్‌లో కలిసి వినతి పత్రాన్ని సమర్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు జిలాన్ బాషా, కార్యదర్శి ఇలియాస్ బేగ్, అఫ్జల్, సగీర్, జంజం జమీల్, యూసుఫ్ పాల్గొన్నారు.



షరీఫ్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కొనసాగుతున్న కేబుల్ వైర్ల దొంగతనాలు

- నిందితులను గుర్తించాలని రైతుల వేడుకోలు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మండలంలో వ్యవసాయ బోర్ల వద్ద కేబుల్ వైర్ల దొంగతనాలు కొనసాగుతూనే ఉన్నాయి. కేబుల్ వైర్ల చోరీతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఓవైపు ఆర్థికంగా నష్టాన్ని, మరోవైపు పంట నష్టాన్ని రైతులు చవిచూడాల్సి వస్తోంది. నిందితులను పోలీసులు గుర్తించి తమన ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు. వారం రోజుల క్రితం అగ్రహారం, నిమ్మ నపల్లె, తవళం గ్రామాలలో రెండు రోజుల వ్యవధిలో రాత్రి వేళల్లో సుమారు 60 వ్యవసాయ బోర్ల వద్ద భారీ మొత్తంలో కేబుల్ వైర్లను గుర్తుతెలియని వ్యక్తులు కత్తిరించి దోచుకెళ్లారు. ఈ సంఘటనలపై బాధిత రైతులు నిమ్మనపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగింది. ఆరిపిరెడ్డిగారిపల్లి పరిధిలోని తొట్లి చెరువు సమీపంలో గురువారం రాత్రి మరో మారు రెండు వ్యవసాయ బోర్ల వద్ద గుర్తుతెలియని వ్యక్తులు కేబుల్ వైర్లను దొంగి లించారు. బాధిత రైతు శుక్రవారం ఉదయం నిమ్మనపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం ఓవైపు రైతులు వరి సాగు చేసి ఉండడం, మరోవైపు ఎండ తీవ్రత పెరుగుతుండడంతో పంటలకు సకాలంలో నీరు అందించాల్సి ఉందన్నారు. వ్యవసాయ బోర్ల వద్ద కేబుల్ వైర్లను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేయడంతో రైతులు ఇటు ఆర్థికంగాను, అటు పంటకు నీరు అందించలేక పంట నష్టాన్ని ఎదుర్కోవాల్సి ఉందని ఆవేదన చెందు తున్నారు. పోలీసులు ఇప్పటికైనా రైతులు పడుతున్న బాధలను అర్థం చేసుకుని చోరీలకు పాల్పడుతున్న వ్యక్తులను వెంటనే గుర్తించి శిక్షించాలని కోరుతున్నారు.



ఆరిపిరెడ్డిగారిపల్లి వద్ద కేబుల్ వైర్‌ను దొంగలించిన దుండగులు

పేదలకు జీవనోపాధి కల్పనకు కృషి

ప్రజాశక్తి-వీరబల్లి

పేదలకు సమన్వయ పద్ధతిలో పలు జీవనోపాదుల కల్పనకు కృషి చేస్తున్నట్లు జిల్లా జీవనోపాధుల సమన్వయ అధికారి గంగార్జున తెలిపారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ సభాభవనంలో మండల స్థాయి అధికారులు సమన్వయ సమావేశం జరిగింది. సమావేశంలో గంగార్జున మాట్లాడుతూ జిల్లాలో వీరబల్లి, గాలివీడు మండలాల నుంచి 300 కుటుంబాలతో మొదటి విడతలో రెండు క్లస్టర్లను ఎన్నుకున్నారని తెలిపారు. సిఆర్‌పిలతో 300 కుటుంబాల బేస్‌లైన్ సర్వే పూర్తి చేసి డిపిఆర్ ప్రభుత్వానికి పంపించినట్లు తెలిపారు. ఆ కుటుంబాల ప్రస్తుత జీవనోపాదులు, అవసర జీవనోపాదులను సేకరించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి స్వాతి, మండల పశు వైద్యాధికారి నాగరాజు, మండల ఉద్యానవన అధికారి వనిత, ప్రకృతి వ్యవసాయ అధికారి అపర్ణ, ఏరియా కో-ఆర్డినేటర్ కొండా శ్రీనివాసులు రెడ్డి, ఎపియం ఖాదర్ వలి, రమేష్, సిసి గంగాధర్, రైతు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



సమన్వయ సమావేశంలో మాట్లాడుతున్న గంగార్జున

తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలి



రిలే దీక్షలకు మద్దతు తెలుపుతున్న ఆటోవర్కర్స్ యూనియన్ నాయకులు

ప్రజాశక్తి-పుల్లంపేట

ఓబులవారిపల్లి మండల పరిధిలోని మంగంపేట ఎపిఎండిసి పబ్లిక్ స్కూల్ లో తొలగించిన సబ్ స్టాఫ్ సిబ్బందిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఆటోవర్కర్స్ యూనియన్ మండల నాయకలు నాగిపోగు పెంచలయ్య, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ మండల నాయకులు కేశవులు డిమాండ్ చేశారు. సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన రిలేనిరాహార దీక్షలు శుక్రవారం 12వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రిలే నిరాహార దీక్షల్లో వారు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని వాగ్దానం చేశారని గత ప్రభుత్వాలు ఇచ్చిన ఉద్యోగాలు తొల గించడం తప్ప ఎనిమిది నెలల్లో ఒక్క ఉద్యోగం ఇచ్చిన పాపాన పోలేదని ధ్వజ మెత్తారు. 25 రోజులుగా ధర్నాల రూపంలో ఆందోళన చేసిన, 12 రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్నా ఎపిఎండిసి యాజమాన్యం కానీ, అధికారులు కానీ స్పందించక పోవడం దారుణమన్నారు. సంస్థకు భూములు ఇచ్చి మూడు సంవత్సరాల నుంచి పనిచేస్తున్న స్కావెంజర్స్, హౌస్ కీపర్, దళితులు, బిసిలను కొత్త కాంట్రాక్టర్ అధికారులతో లోపాయికారి ఒప్పందం కుదు ర్చుకున్నారని అన్నారు. మూడు నెలలు పని చేయించుకొని జీతాలు అడిగితే ఎటువంటి ముందస్తు నోటీసు ఇవ్వకుండా వద్దు పొమ్మని చెప్పడం సరికాదన్నారు. తొలగించిన వారిని తక్షణమే విధు ల్లోకి తీసుకోవాలని లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు.

తేక్వాండోలో సత్తాచాటిన 'సమిష్టి' విద్యార్థులు



పతకాలు సాదించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

రాష్ట్రస్థాయి తేక్వాండో పోటీల్లో సమిష్టి స్కూల్ విద్యార్థులు సత్తా చాటారని కరస్పాండెంట్ కరీముల్లా ఖాన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాకినాడ జెఎన్‌టియుకెలో జరిగిన రాష్ట్రస్థాయి తేక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీలలో సమిష్టి స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారని అన్నారు. ఈ పోటీల్లో ఆరవ తరగతి చదువు తున్న ఎస్. మహమ్మద్‌రెహాన్, పి.తనీశ్వర్‌రెడ్డి, రెండవ తరగతి చదువుతున్న ఎస్. మిస్బా ఫాతిమా, ఎల్‌కెజి చదువుతున్న విజ్ఞాన్ శామల్ తేజ్ గోల్డ్ మెడల్ సాధించారని అన్నారు. గోల్డ్ మెడల్స్ సాధించిన విద్యార్థులను అభినందించారు. భవిష్యత్తులో మరిన్నీ పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

రాష్ట్ర స్థాయిలో 'విజ్‌డమ్'విద్యార్థుల ప్రతిభ

రాష్ట్రస్థాయి తేక్వాండో పోటీలలో విజ్‌డమ్ సిబిఎస్‌ఇ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారని విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ టి.ప్రదీప్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకినాడ జెఎన్‌టియుకె లోని ఎన్టీఆర్ మెమోరియల్ ఇండోర్ స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి తేక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీల్లో విజ్ డమ్ హై స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న కె.నిఖిల్‌కుమార్ సిల్వర్ మెడల్, సి.శశాంక్ అభినయ్ బ్రాంజ్ మెడల్ సాధించారని తెలిపారు. మెడల్స్ సాధించిన విద్యార్థులను చైర్మన్ ప్రదీప్‌తో పాటు అడ్మిన్ డైరెక్టర్ టి.మదన్మోహన్, ప్రిన్సిపల్ టి.ప్రియాంక, వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్.కె మౌలా, సుప్రియ అభినందించారు.



పతకాలుసాధించిన విద్యార్థులతో కరస్పాండెంట్



ఇ-క్రాప్ విధానాన్ని పరిశీలిస్తున్న జెసి ఆదర్శరాజేంద్రన్

ఇ-క్రాప్ నమోదును తనిఖీ చేసిన జెసి

ప్రజాశక్తి - లక్కిరెడ్డిపల్లి

మండలంలోని కోనంపేట గ్రామంలో శుక్రవారం మామిడి తోటలలో ఇ-క్రాప్ విధానాన్ని జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ సర్వే సక్రమంగా నిర్వహించి ప్రతిరైతుకు సరైన హద్దులు చూపించాలని చెప్పారు. రీ సర్వేకి వెళ్ళే ముందు ప్రతిరైతుకు మూడు రోజులు ముందుగానే నోటీసులు జారి చేసి వారు కానీ వారి కుటుంబ సభ్యులు కాని అందుబాటు లో ఉండేలాగా చూసుకోవాలని తెలిపారు. అనంతరం లక్కిరెడ్డిపల్లి తహశీల్దార్ కార్యా లయాన్ని జెసి తనిఖీ చేఉశారు. తహసీల్దార్ శ్రీనివాసులు సమక్షంలో విఆర్‌ఒల ద్వారా పలు రకాల ఫైళ్లను తెప్పించు కుని పరిశిలించి విఆర్‌ఒలు, సిబ్బంది పనితీరు మెరుగు పరుచుకోవాలని సూచించారు. వారికి తగు సుచనలు చేసి వీలైనంత త్వరగా ప్రజా సమస్యల పరిష్కరించేందుకు కృషిచేయాలన్నారు. జెసి వెంట తహశీల్దార్ హరిప్రసాద్, ఆర్‌ఐ రాజేష్, మండల సర్వేయర్ మదన్మోహన్ రెడ్డి, హార్టికల్చర్ అధికారులు పాల్గొన్నారు.

మనిషా విద్యానికేతన్‌లో ఘనంగా వార్షికోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

మండల కేంద్రం లక్కిరెడ్డిపల్లిలోని మనీషా విద్యానికేతన్ హైస్కూల్‌లో ఘనంగా 30వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగానిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలతో పాటు అనేక వినోద కార్యక్రమాలు నిర్వహించారు. స్కూల్ కస్పాండెంట్ కృష్ణ చైతన్య రెడ్డి మాట్లాడుతూ స్కూల్ 30 సంవత్సరాలు పూర్తి చేసుకుందని ఈ స్కూల్లో చదివిన విద్యార్థులు ఎంతో మంది ఉన్నత స్థానాలకు చేరుకున్నందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు ఉత్తమ లక్షాలను ఏర్పంచుకొని కలలు సహకారం చేసుకోవాలని తెలిపారు.

కెవికెలో శాస్త్రీయ సలహా సంఘ సమావేశం

ప్రజాశక్తి-కలికిరి

కలికిరిలోని కృషి విజ్ఞాన కేంద్రం 2024-25 సంవత్సరంలో చేసిన కార్యక్రమాల గురించి, 2025-26 సంవత్సరంలో చేయబోయే కార్యక్రమాల ప్రణాళిక ఏర్పాటు కోసం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, సహ పరిశోధనా సంచాలకులు, డాక్టర్ వి.సుమతి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వ్యవసాయ సాంకేతిక అను ప్రయోగ పరిశోధన సంస్థ, జోన్-10 డైరెక్టర్ డాక్టర్ ఎన్.మీరా, వ్యవసాయ విస్తరణ సంచాలకులు, గుంటూరు ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ విస్తరణ సంచాలకులు డాక్టర్ జి.శివనారాయణ హజ రయ్యారు. అధికారులు రైతులు, కృషి విజ్ఞాన కేంద్రంలోని ప్రదర్శనా క్షేత్రాలను సంద ర్శించారు. తర్వాత కేంద్రం ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ కె. మంజుల 2024-25 సంవ త్సరంలో చేపట్టిన వివిధ కార్యక్రమాల గురించి పవర్ పాయింట్ ద్వారా వివరించారు. తరువాత శాస్త్రవేత్తలు పంట రకాలు, వాతావరణం, చీడలు పీడలు, అడవి పందులు, పశువులలో సమస్యలు మొదలగు అంశాల మీద చేసిన చేయ బోయే ప్రదర్శన క్షేత్రాల గురించి వివరించారు. డైరెక్టర్, ఆఫీసర్లు 2025-26 సంవత్సరంలో చేపట్టే ప్రయోగాల గురించి శాస్త్రవేత్తలకు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో తిరుపతి వ్యవసాయ పరి శోధన స్థానం, శాస్త్ర వేత్తలు డాక్టర్ మహేశ్వర్ రెడ్డి, డాక్టర్ దేవకి, డాక్టర్ వజంత, రాస్ కెవికె, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్, శ్రీనివాస్, వేలూరు కెవికె, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ తిరుమురుగన్, అన్నమయ్య జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ గుణశేఖర్, పీలేరు హార్టికల్చర్ ఆఫీసర్, సుకుమార్, అభ్యుదయ రైతులు రాజారామిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, సహదే రెడ్డి, కె కె సిబ్బంది పాల్గొన్నారు.



కెవికెని పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు



ఉత్తీర్ణులైన విద్యార్థులకు పత్రాలను అందిస్తున్న రమణమూర్తి

హిందీ ప్రచార సభ పరీక్షలతో ఉపాధి

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని టి.కమ్మపల్లి పంచాయతీ పరిధిలోగల కృష్ణంపల్లి ప్రాథమిక పాఠశాలలో హైదరాబాద్ హిందీ ప్రచార సభ పరీక్షలు ఉత్తీర్ణులైన విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సివి రమణమూర్తి ప్రమాణ పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులను హైదరాబాద్ హిందీ ప్రచార సభ పరీక్షలు రాయిస్తున్నట్లు తెలిపారు. టి.కమ్మపల్లి జడ్‌పి హైస్కూల్ హిందీ ఉపాధ్యాయులు సయ్యద్ సర్తాజ్ హుస్సేన్ మాట్లాడుతూ హైదరాబాద్ హిందీ ప్రచార సభ పరీక్షలతో బోధనా రంగంలో ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు ఎస్. ఆసిఫ్‌భాషా పాల్గొన్నారు.

రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గౌరీ

ప్రజాశక్తి-కలికిరి



ఎరుకల సేవా సంఘం రాష్ట్ర మహిళ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కలిపి ఎస్‌టి కాలనీకి చెందిన జగన్నాథం గౌరీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ఉపా ధ్యక్షుడు శ్రీనివాస్ వర్మ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ ఎరుకల సేవా సంఘం రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ ఆదేశాల మేరకు ఆదివాసీ ఎరుకల హక్కుల కొరకు, అణగారిన ఎరుకల హక్కుల సాధన కొరకు గౌరీని ఏకగ్రీవంగా ఎన్నిక చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గౌరీ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి మహిళ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నుకోవడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఎరుకల సేవా సంఘం అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆమెకు వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఎన్నుకోవడం పై పలువురు ఎరుకల సంఘం నాయకులు, బంధువులు హార్షం వ్యక్తం చేశారు.

బిసి రుణాల దరఖాస్తు గడువు 12 వరకు పెంపు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

సబ్సిడీ రుణాల గడువును రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 12వ తేదీ వరకు పొడిగించిందని ఎంపిడిఒ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువత స్వయం ఉపాధి కోసం అందిస్తున్న బిసి, ఇబిసి, ఇడబ్ల్యూఎస్, కాపు సహా ఇతర కార్పొరేషన్ల రుణాల గడువును ఈనెల 7నుంచి 12వ తేదీ వరకు పొడిగించిందన్నారు. లబ్ధిదారుల నుంచి వస్తున్న వినతులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం అర్హులందరికీ కార్పొరేషన్ల రుణాలను అందించడానికి అవకాశం కల్పిస్తున్నాదని పేర్కొన్నారు. కార్పొరేషన్ల కింద అందిస్తున్న రుణాలు లబ్ధిదారులకు 50 శాతం సబ్సిడీతో మంజూరు చేయనున్నట్లు తెలిపారు. వయస్సు 21 నుంచి 60 ఏళ్ల మధ్య ఉండి, తెల్ల రేషన్ కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు, బ్యాంకు బుక్, ఫోటోతో అర్హులైన వారు ఈనెల 12వ తేదీ లోపు ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ప్రాథమిక పాఠశాలలో మాసపత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని దలవాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో ఎంఇఒ చక్రధర్‌రాజు ఆధ్వర్యంలో 'మాబడిలో మేము' అనే పాఠశాల మాస పత్రికను విద్యార్థుల సమక్షంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కొత్తపేట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలకు ఇలాంటి మాస పత్రికను ప్రచు రించడం జిల్లాలో ఇదే మొదటిదని ఇందుకు పాట పాడిన ఉపాధ్యాయులు రమణ కృషి సహకరించిన విద్యార్థుల కృషి అభినందనీయమని పేర్కొన్నారు. అనంతరం ఎంఇఒ మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలకు ఒక మాసపత్రికను ప్రచురించడం ఒక వినూ త్నమైన ఆలోచన అని మాసపత్రికలో పిల్లలు చేసిన వివిధ ప్రాజెక్టులు గీసిన బొమ్మలు రాసిన కథలు, కవితలు, పజిల్స్, పాఠశాలలో జరిగిన వివిధ అంశాలతో పిల్లలలో సృజ నాత్మకత ధోరణి పెంచేలా ఉన్నాయని అన్నారు. అనంతరం ఉపాధ్యాయులు రమణ మాట్లా డుతూ మనం పాఠ శాలలో చేసే వినూత్న కార్యక్రమాలు ఇలా మాసపత్రిక రూపంలో ప్రచురించడం వల్ల ఎప్ప టికీ మరపురాని జ్ఞాపకాలుగా ఉంటాయని, మన పాఠ శాలలోని వినూత్న కార్యక్రమాలు తల్లిదండ్రులకు సులభంగా చేరు అవుతాయని పేర్కొన్నారు.

సుబ్బనరసారెడ్డికి సన్మానం

ప్రజాశక్తి-పుల్లంపేట

పుల్లంపేట విభిన్న ప్రతిభావంతుల సమైక్య సేవా సంఘం అధ్యక్షుడు మల్లు సుబ్బ నరసారెడ్డికి డాక్టరేట్ వచ్చిన సందర్భంగా స్థానిక ఎస్‌బివిడి సభా కళాశాల ప్రాంగణంలో కళాశాల ప్రిన్సిపల్ బాలా జీరాజు ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుల్లంపేట విభిన్న ప్రతి భావంతుల సమైక్య సేవా సంఘం ద్వారా అధ్యక్షులు పలు సేవా కార్యక్రమాలను చేపట్టి ఎంతోమంది విభిన్న ప్రతిభావంతులకు సహాయ సహకారాలు అందిస్తున్నారని అన్నారు. పేదవారికి సహాయం అందిస్తూ ముందుకు వెళ్తున్న ఆయనకు ఫ్రెండ్‌షిప్ మినిస్ట్రీస్ వారు డాక్టర్ రేట్ ప్రదానం చేసి గౌరవించడం అభినందనీయన్నారు. సుబ్బనరసారెడ్డి మన కళాశాల విద్యార్థి కావడం మన కళాశాకు ఎంతో గర్వకారణమని అన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు సుబ్రహ్మణ్యం, నరసయ్య, ఉపాధ్యక్షులు వాహిద్, కోశాధికారి నరసింహులు,బాలాజీ సభ్యులు శ్రీనివాసులు, మురళి పాల్గొన్నారు.

మోడల్ పంచాయతీలుగా మద్దిరేవుల, లక్కిరెడ్డిపల్లి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

మండల కేంద్రం లక్కిరెడ్డిపల్లెలోని స్థానిక గ్రామ పంచాయతీ కార్యాల యంలో శుక్రవారం గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక పై కేంద్ర ప్రభుత్వ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్మెంట్ శాఖ పరిశీలకులు ప్రసాద్ లక్కిరెడ్డిపల్లి, మద్దిరేవుల గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 115 గ్రామ పంచాయతీలలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల కార్యాచరణ చేయడం జరిగిందని తెలిపారు. లక్కిరెడ్డిపల్లె మండలంలోని లక్కి రెడ్డిపల్లె, మద్దిరేవుల గ్రామ పంచాయితీలు మోడల్ గ్రామ పంచాయతీలుగా ఎంపిక కావడం హర్షదాయకమని అన్నారు. అనంతరం మద్దిరేవుల గ్రామ పంచాయతీని సందర్శించి గ్రామ పంచాయతీ అభివృద్ధిపై గ్రామ పంచాయతీ సర్పంచ్ తుమ్మల చంద్రమ్మ, పంచాయతీ కార్యదర్శి రజనీష్‌రెడ్డితో అభివృద్ధిపై చర్చించారు. గ్రామ అభివృద్ధి కోసంచేసిన ప్రణాళికపట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. పంచాయతీలో అభివృద్ధి కార్యక్రమాలు, ఎస్‌డబ్ల్యూపిసి అభివృద్ధి చేయడం పట్ల మరింత చొరవ చూపి గ్రామంలో విద్య, వైద్యం, పరిసరాల పరిశుభ్రత, మొక్కలు నాటడం, మెడికల్ క్యాంపులు నిర్వహించి ప్రజల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని తెలిపారు. కూలీలకు వంద రోజుల ఉపాధి పనులు కల్పించాలని, రోడ్లు, తాగునీరు ఇంటింటికి కుళాయి కనెక్షన్ ఉండేలా చూ డాల న్నారు. కార్యక్రమంలో మద్ధిరేవుల, లక్కిరెడ్డిపల్లె పంచాయతీ కార్యదర్శిలు రజనీష్‌రెడ్డి, సుదర్శన రెడ్డి, మద్దిరేవుల సర్పంచ్ తుమ్మల చంద్రమ్మ, అడ్వకేట్ తుమ్మల వంశీకృష్ణ పాల్గొన్నారు.



కల్పవృక్ష వాహనంపై శ్రీవారు

ఘనంగా శ్రీప్రసన్న వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండలంలోని కోసవారిపల్లెలో వెలసిన శ్రీప్రసన్న వెంకటరమణ స్వామి ఆలయలో శుక్రవారం టిటిడి ఆధ్వర్యంలో స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. టిటిడి ఆగమ అడ్వైజర్ శ్రీనివాసచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు కృష్ణప్రసాద్ బట్టర్, రమేష్‌బాబు, కృష్ణమూర్తి, ధనుష్ సాంప్రదాయబద్ధంగా నియమ నిష్టలతో ఉదయం కల్ప వృక్ష వాహనం శ్రీవారి ఊరేగింపు నిర్వహించారు. సాయంత్రం హనుమంత వాహనలపై చేపట్టారు.కార్యక్రమంలో ఆలయ ఇన్స్‌పెక్టర్ దిశంత్ కుమార్, ఆలయ సిబ్బంది నగేష్, నాగరాజు, భక్తులు పాల్గొన్నారు.

కోటి మంది సభ్యత్వం కలిగిన పార్టీ టిడిపి

ప్రజాశక్తి-రామాపురం

భారతదేశంలోనే కోటి మంది సభ్యత్వం కలిగిన ఏకైక ప్రాంతీయ పార్టీ తెలుగుదేశం అని రాష్ట్ర రవాణా యువజన క్రీడ శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ సోదరుడు మండిపల్లి లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని హసనాపురం పంచాయతీ గొల్లపల్లికు చెందిన పప్పిరెడ్డి ఇరగం రెడ్డి గృహప్రవేశ కార్యక్రమంలో ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్య కర్తల సంక్షేమం కోసం ఫండ్ ఏర్పాటుచేసి, బీమా పాలసీ పెట్టిన ఘనత నారా లోకేష్‌కే దక్కుతుందని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాన్, మంత్రి నారా లోకేష్ అహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు. నియోజకవర్గం లో మారుమూల గ్రామాలలో సైతం సిమెంట్ రోడ్లు, తాగునీటి సమస్య పరిష్కారానికి మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ఎంతగానో కృషి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి నాయ కులు గాలివీడు సురేంద్రనాథ్‌రెడ్డి, చెన్న కృష్ణారెడ్డి, పప్పిరెడ్డి హరినాథ్‌రెడ్డి, సహదేవరెడ్డి, మాజీ జడ్‌పిటిసి నాగసుబ్బారెడ్డి, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-బి.కొత్తకోట : మండలంలోని బురకాయలుకోట 132/కెవి సబ్ స్టేషన్‌లో మరమ్మతులు చేస్తున్న కారణంగా బి.కొత్తకోట పట్టణంతో పాటు మండల పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం ఉదయం 9 గంటల నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో రైతులు, ప్రజలకు నాణ్యమెన విద్యుత్ అందించడమే లక్ష్యమన్నారు.సబ్ స్టేషన్‌లో మరమ్మతుల రీత్యా మూడు గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలి పారు. ప్రజలు ఈ అసౌకర్యాన్ని అర్థం చేసుకొని సహకరించాలని కోరారు.

రామసముద్రం ఎస్‌ఐగా రవికుమార్ బాధ్యతల స్వీకరణ



ప్రజాశక్తి-రామసముద్రం : రామసముద్రం నూతన జి.రవికుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పని చేస్తున్న ఎస్‌ఐ సి.వెంకటసు బ్బయ్య వారం రోజుల క్రితం ఎసిబి అధికా రులకు పట్టుబడిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ మండలంలో నేరాలను అదుపులో ఉంచడానికి, తన వంతు కృషి చేస్తానని, ఎవరైనా చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వైసిపి మండల అధ్యక్షులుగా కేశవరెడ్డి

ప్రజాశక్తి-రామసముద్రం : రామసముద్రం మండలం వైసిపి అధ్యక్షులుగా మాజీ సింగిల్ విండో చైర్మన్ పి. కేశవరెడ్డిని నియమిస్తూ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఉత్తర్వుల మేరకు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుత పార్టీ తనపై పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ బలోపేతం కోసం అందరి సహకారంతో కృషి చేస్తానన్నారు.

తాగునీటి సమస్యకు ముందస్తు చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి-ములకలచెరువు

ములకలచెరువు మండలంలో తాగునీటి సమస్య ఏర్పడకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని వైసిపి ప్రజాప్రతినిధులు, ఎంపిపి సాయిలీల, సర్పంచ్ రాంబాబు కోరారు. శుక్రవారం ములకలచెరువు మండల సర్వసభ సమావేశం నిర్వహిం చారు. గత రెండు మండల సర్వసభ సమావేశాలు నిర్వహించకుండా కూటమి నాయకులు అడ్డుకున్న విషయం తెలిసిందే. దీంతో ఇటీవల జడ్‌పి సిఇఒ ఎంపిడిఒ కార్యాలయంలో తంబలపల్లి టిడిపి ఇన్‌ఛార్జి జయచంద్రారెడ్డితో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఐదు మంది కూటమి నాయకులను మండల సర్వసభ్య సమావేశానికి ప్రత్యేక ఆహ్వానితులుగా ఆహ్వానిస్తామని జడ్‌పి సిఇఒ తెలపడంతో మండల సమావేశం శుక్రవారం ప్రశాంతంగా జరిగింది. ఈ సమావేశంలో ఎంపిపి సాయి లీలా, జడిపిటిసి మోహన్ రెడ్డి టిడిపి నాయకులు నరసింహరెడ్డి, ప్రసాద్రెడ్డి, కేశవరెడ్డి, ప్రభాకర్ రెడ్డి. సర్పంచులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్



సమావేశంలో మాట్లాడుతున్నఎఎస్‌పి రామ్‌నాథ్‌హెగ్డే

ఇద్దరు దొంగలు అరెస్టు

- రూ.99 వేలు విలువ చేసే వెండి స్వాధీనం : ఎఎస్‌పి

ప్రజాశక్తి-నందలూరు

కడప-తిరుపతి ప్రధాన రహదారిలోని మూసివేసిన ఆల్విన్ కర్మాగారం వద్ద శుక్రవారం ఇద్దరు దొంగలను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.99 వేలు విలువ చేసే వెండి సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు రాజంపేట ఎఎస్‌పి మనోజ్‌రామ్‌నాథ్‌హెగ్డే తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక పోలీసు స్టేషన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమకు రాబడిన సమాచారం మేరకు స్థానిక ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తన సిబ్బందితో ఉదయం 11.30 గంటల సమయంలో ఆల్విన్ ఫ్యాక్టరీ గేటు వద్దకు వెళ్లగా తలారి బాలకృష్ణ, పుర్లగుంట రామాంజి అనే వ్యక్తులు పోలీసు వారిని చూసి పారిపోవుటకు ప్రయత్నించగా వారిని వెంబడించి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి వద్ద ఉన్న సంచిలో మూడు వెండి కిరీటములు, రెండు వెండి పల్లెములు, మూడు వెండి దీపాలు, ఒక శఠగోపం స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఆడపూరు గ్రామంలోని మంచాలమ్మ ఆలయంలో గత ఏడాది డిసెంబర్ 24న దొంగలింపబడిన వస్తువులుగా వీటిని గుర్తించామని అన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందని అన్నారు. ఈ కేసులో కీలకంగా వ్యవహరించిన కానిస్టేబుల్ దర్బార్‌బాసాను ఎఎస్‌పి అభినందించారు. ఈ సమావేశంలో రాజంపేట రూరల్ సిఐ బివి.రమణ, ఎఎస్‌ఐ లు సుబ్బరాయుడు, శంకర్ నాయక్, హెడ్ కానిస్టేబుల్ రాజగోపాల్, పోలీసులు పాల్గొన్నారు.